నత్తే నయం..!

సా...గుతున్న శివాజీపాలెం శ్మశాన వాటిక పనులు



నత్తనడకన సాగుతున్న కొత్త షెడ్ల నిర్మాణ పనులు



శివాజీపాలెం శ్మశానవాటిక ముఖద్వారం

- రూ.58 లక్షలతో పనులు ప్రారంభించిన జీవీఎంసీ
- పనుల్లో నాణ్యతాలోపం, జాప్యంపై స్థానికుల అసంతృప్తి

ఎంవీపీకాలనీ: నత్తనడకన 17వ వార్డు శివాజీపాలెం శ్మశాన వాటిక పనులు సాగుతున్నాయి. శివాజీపాలెం, పీతల వానిపాలెం వాసుల అవసరాలకు అనుగుణంగా శ్మశాన వాటిక అభివృద్ధి చేయాలనే డిమాండ్ చాలా ఏళ్లుగా ఉంది. దశాబ్దాల క్రితం జీవీఎంసీ ఈ శ్మశాన వాటికను నిర్మించి వదిలేసింది. స్వచ్ఛంద సంస్థలు కల్పించిన సౌకర్యాలు మినహా తరువాత ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జీవీఎంసీ ఈ శశ్మాన వాటికలో చేపట్టలేదు. దీంతో పూర్తి నిర్లక్ష్యానికి గురైన శ్మశాన వాటికను ఆధునికీకరించాలని స్థానికుల విజ్ఞప్తి మేరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.58 లక్షలతో ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకు అనుగుణంగా శంకుస్థాపన కూడా స్థానిక నాయకులు, అధికారులు చేశారు. ఆ తరువాత ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభం కాలేదు.



అపరిశుభ్రంగా శ్మశాన వాటిక ప్రవేశం వద్ద పరిసరాలు



పాత షెడ్లకు ఫ్లోరింగ్ చేసి వదిలేసిన దృశ్యం

నత్తనడకన పనులు.. నాణ్యతాలోపం

ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చాలా కాలం ఈ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. అయితే స్థానిక కార్పొరేటర్ జీవీఎంసీ తీరుపై నిరసనకు దిగడంతో జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు స్పందించి పనులను ప్రారంభించారు. అయితే పనులు ప్రారంభమై మూడు నెలలు గడిచినా ఎక్కడి పనులు అక్కడే అన్నట్లుగా పరిస్థితి ఉంది. జీవీఎంసీ అనుమతితో రూ.58 లక్షలతో కాంట్రాక్టర్ ఈ పనులు ప్రారంభించారు. అయితే ఈ పనుల్లో భాగంగా దహన సంస్కారాల కోసం కొత్తగా రెండు షెడ్లు నిర్మాంచాల్సి ఉంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పటిష్టమైన పునాదితో వీటిని నిర్మించాలి. దీంతో పాటు ఇప్పటికే అక్కడ ఉన్న పాత షెడ్లును ఆధునీకరించడం, అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. అయితే ఇప్పటికీ కేవలం పాత షెడ్లలో ఫ్లోరింగ్ ఆధునికీకరణ మాత్రమే పూర్తయింది. వాటిపై కొత్తగా రేకులను అమర్చడంతో పాటు రెండు కొత్త షెడ్లను నిర్మించాల్సి ఉంది. అయితే కొత్త షెడ్ల నిర్మాణం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. దీంతో కాంట్రాక్టర్ పనితీరు, పనుల్లో జరుగుతున్న జాప్యంపై స్థానిక గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతలో సైతం రాజీ పడుతున్నా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఇంజినీరింగ్ విభాగం అధికారులు పనుల్లో వేగం పెరిగేలా, నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

> **పనుల్లో జాప్యం వాస్తవమే**
>
> శ్మశానవాటిక ఆధునికీకరణ పనుల్లో గతంలో జాప్యం జరిగిన మాట వాస్తవమే. అయితే ప్రస్తుతం పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం షెడ్లు నిర్మాణం జరుగుతోంది. పునాదులు పూర్తయిన వెంటనే శ్లాబ్‌లు వేయడం జరుగుతుంది. అనంతరం ఫ్లోరింగ్ పనులు నిర్వహిస్తాం. దీంతో పాటు ప్రధాన ద్వారం గేటు పనులు చేయాల్సి ఉంది. ఈ దిశగా పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్‌కు సూచిస్తున్నాం. ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం.
>
> – అప్పలనాయుడు, ఏఈ, జీవీఎంసీ

క్లుప్తంగా

ఏయూ పురుషుల హాకీ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ విజయ మోహన్

విశాఖ విద్య: ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఆంధ్రా యూనివర్సిటీ పురుషుల హాకీ జట్టు ఎంపిక గురువారం జరిగింది. మద్రాస్ యూనివర్సిటీలో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు, కోచ్‌లకు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు డీఏను పెంచి సహకారం అందించారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తారని చెప్పారు. జట్టు కోచ్ రాంబాబు, మేనేజర్, నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ దుర్గారావు, డాక్టర్ దిలీప్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం పునరుద్ధరణ



శ్రీకాంత్‌నగర్ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన కొత్త స్తంభం

ఆరిలోవ: జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి శ్రీకాంత్‌నగర్ ప్రధాన రహదారిలో ఓ ట్రావెల్ బస్ ఢీకొనడంతో విరిగిన విద్యుత్ స్తంభం స్థానంలో విద్యుత్ విభాగం అధికారులు గురువారం కొత్త స్తంభం వేశారు. మంగళవారం అర్ధరాత్రి ఓ ట్రావెల్ బస్ బలంగా ఢీకొనడంతో డివైడర్ మధ్యలో ఉన్న సిమెంట్ విద్యుత్ స్తంభం విరిగిపోయి రెండు ముక్కలైన విషయం తెలిసిందే. దీంతో విషయం తెలుసుకున్న విద్యుత్ విభాగం అధికారులు గురువారం విరిగిన స్తంభాన్ని తొలగించారు. దాని స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి, తెగిపోయిన విద్యుత్ తీగలను పునరుద్ధరించారు. వి.ఎల్.ట్రావెల్స్ బస్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నట్లు ఆరిలోవ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ హేమ తెలిపారు. స్తంభాన్ని ఢీకొట్టిన బస్ యజమానిపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలియజేశారు.

నిరీక్షణ యాత్రికుల జూబ్లీ వేడుకలు



సందేశం ఇస్తున్న బిషప్ జయరావు, ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్

కంచరపాలెం: జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం సెయింట్ పీటర్స్ ఆవరణలో గురువారం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ అధ్వర్యంలో చారిత్రాత్మక నిరీక్షణ యాత్రికుల జూబ్లీ వేడుకలను విశాఖ ఆర్చి బిషప్ రెవరెండ్ పొలిమేర జయరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభువుని యెడల నిరీక్షణ కలిగిన భక్తుల ప్రార్థనలు సేవ- ప్రపంచ శాంతిని నెలకొల్పుతాయన్నారు. యుద్ధాలను నివారించగల గొప్ప నిరీక్షణ యాత్రికులుగా అందరం రూపొందాలని పిలుపునిచ్చారు. ముందుగా విశాఖ ఆర్చి బిషప్ రెవరెండ్ పొలిమేర జయరావు, రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ జూబ్లీ రెప్లికాను ఆవిష్కరించారు. సుమారు 150 మంది ఫాదర్లు, నగరవ్యాప్తంగా వందల సంఖ్యలో కథోలికులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పరిశుద్ధ జలంతో ప్రజలను ఆశీర్వదించారు.

విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డులో తొలగిన అంధకారం

సాక్షి ఎఫెక్ట్..



విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డులో వెలిగిన లైట్లు

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డులో విద్యుత్ దీపాలు వెలిగాయి. జాతీయ రహదారి నుంచి బీచ్ రోడ్డు వరకు విశాఖ వ్యాలీ స్కూల్ మీదుగా సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల మేర అన్ని విద్యుత్ దీపాలు సుమారు నెల రోజుల నుంచి వెలగడం లేదు. దీంతో రాత్రివేళ చీకటితో వాహనచోదకులు ఇబ్బంది పడేవారు. రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు కనిపించక ప్రమాదాలకు గురవుతుండేవారు. ఈ సమస్యపై 'విశాఖ వ్యాలీ స్కూల్‌రోడ్డులో అంధకారం' శీర్షికతో గత నెల 30న సాక్షిలో వెలువడిన కథనానికి జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు స్పందించారు. ఈ రోడ్డులో అన్ని విద్యుత్ దీపాలు అమర్చి వెలిగించారు. అంధకారం తొలగిపోడంతో వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేస్తూ అధికారులకు, సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

పదో వార్డులో వర్గపోరు

జారుకున్న ఎమ్మెల్యే వెలగపూడి



పదోవార్డు వివేకానందనగర్‌లో టీడీపీ కార్యకర్తల వాగ్వాదం

ఆరిలోవ: నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీ వర్గపోరు మరోసారి బయటపడింది. గత ఎన్నికల నుంచి తెలుగు తమ్ముళ్లు రెండు వర్గాలు విడిపోయారు. పలు సందర్భాల్లో ఒకరికొకరు విమర్శలు చేసుకోవడం, వాగ్వాదం చేసుకోవడం జరిగింది. దీంతో ఏ అభివృద్ధి కార్యక్రమమైనా ఒక వర్గం హాజరైతే మరో వర్గం నేతల్లో చాలా మంది డుమ్మా కొట్టేవారు. తాజాగా గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పదో వార్డు వివేకానంద పార్కు ఆధునికీకరణ పనులకు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భర్త రాజశేఖర్, టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు వర్గంతో పాటు, బలగ సుధాకర, రమణి, కొండమ్మ వర్గం కూడా పాల్గొన్నాయి. దీంతో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు కూడా ఆశ్చర్యానికి గురయ్యారు. రెండు వర్గాలు కలిసిపోయాయని ఆనందించారు. అయితే కొద్దిసేపటికే రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఏ కార్యక్రమాలకు మమ్మల్ని పిలవడంలేదంటూ కార్పొరేటర్ భర్తను మరో వర్గం కార్యకర్తలు నిలదీశారు. మిమ్మల్ని పిలవాల్సిన అవసరం లేదంటూ కార్పొరేటర్ వర్గం తెగేసి చెప్పడంతో రెండు వర్గాల మధ్య నువ్వెంత అంటే నువ్వెంత అంటూ మాటల యుద్ధం చోటుచేసుకొంది. రెండు వర్గాల టీడీపీ కార్యకర్తలు చుట్టుముట్టకముందే ఎమ్మెల్యే కారు ఎక్కి వెళ్లిపోయారు. ఆ వర్గాల మధ్య గొడవ మాత్రం ఆగలేదు. దీంతో పార్కు లోపల ప్రారంభమైన పంచాయితీ ప్రధాన రహదారిపైకి చేరింది. వాహన రాకపోకలకు సైతం కొంతసేపు ఆటంకం కలిగించింది. రెండు వర్గాలతో మాట్లాడి సయోధ్య కుదర్చాల్సిన ఎమ్మెల్యే మెల్లగా జారుకోవడంతో కార్యకర్తలు తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు.

చురుగ్గా హౌసింగ్ డీడీల వాపస్



హౌసింగ్ డీడీ వాపస్ కోసం వచ్చిన దరఖాస్తుదారులు

సీతమ్మధార : ఇళ్ల కోసం డీడీలు కట్టినా మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులకు అధికారులు డీడీలను వాపసు చేశారు. జోన్-3 పరిధిలోని 500 మంది దరఖాస్తుదారులకుగాను ప్రభుత్వం రూ.కోటి నిధులు విడుదల చేయడం తెలిసిందే. దీంతో కొద్దిరోజులుగా దరఖాస్తుదారులకు యూసీడీ విభాగం సిబ్బంది చెక్కులను అందజేస్తున్నారు. జోన్ పరిధిలోని తూర్పు, ఉత్తర నియోజకవర్గాలకు చెందిన దరఖాస్తుదారులకు యూసీడీ విభాగంలో బయోమెట్రిక్ విధానంలో వివరాలు నమోదు చేస్తున్నారు. దరఖాస్తుదారుల ఆధార్ కార్డు, బ్యాంక్‌ఖాతా, డీడీ కాపీ వంటి వివరాలు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రోజుకు 40 నుంచి 50మంది వివరాలు సేకరిస్తున్నారు. జోనల్‌కమిషనర్ కే.శివప్రసాద్ పర్యవేక్షణలో ఏయూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రాము ఆధ్వర్యంలో సిబ్బంది దరఖాస్తుదారుల వివరాల సేకరణ, చెక్కుల జారీలో నిమగ్నమయ్యారు.

ఆలయంలో అన్న సమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి ఆరిలోవ ప్రాంతం ఎస్‌కేఎంఎల్ నగర్‌లో కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం ఆవరణలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. మార్గశిర మాస పూజల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఎస్‌కేఎంఎల్ నగర్‌తో పాటు ఆరిలోవ కాలనీ, జై భీం నగర్, నలభై గజాల కాలనీ, శివాజీనగర్, ఆపరేషన్ కాలనీ, దుర్గాబజార్ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని భక్తులకు ప్రసాదం వడ్డించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



మాట్లాడుతున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ సోమన్నారాయణ

అల్లిపురం: నగరపాలక సంస్థ పరిధిలో వీధి విక్రయదారులు, ఆహార సరఫరాదారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ప్రధాన కార్యాలయంలో ఆయన వీధి వ్యాపారులు, ఫంక్షన్ హాల్ నిర్వాహకులు, క్యాటరింగ్ నిర్వాహకులు, దుకాణదారులుతో అవగాహన కార్యక్రమం చేపట్టారు. జనవరి 1 నుంచి 120 మైక్రాన్ల లోపు మందం కలిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు నిషేధించడమైందన్నారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మద్దిలపాలెం: అపరిష్కృతంగా ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర రవాణా , క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. ఈమేరకు విజయవాడలో మంత్రిని గురువారం కలిశారు. పెండింగ్‌లో ఉన్న ఏపీ పీటీడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరామని ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు పుట్టపర్తి వెంకట రమణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. మంత్రి కలిసినవారిలో ఉపాధ్యక్షులు శ్రీనివాస రాజు ,కోశాధికారి పి.వి.విశ్వ మోహన్, సి.సి.ఎస్. పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పార్కు ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి వివేకానంద నగర్‌లో ప్రధాన రహదారి పక్కన పార్కు ఆధునికీకరణ పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ పార్కును జీవీఎంసీ రూ.30 లక్షలతో ఆధునికీకరించనుంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రీసెర్చ్ పార్కులు ఏర్పాటు చేయాలి

మద్దిలపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థులకు రీసెర్చ్ పార్కులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఓబీసీ డిపార్ట్‌మెంట్ ఇంచార్జ్ మూల వెంకటరావు ఒక ప్రకటనలో కోరారు. ఈ పార్కుల ఏర్పాటు వల్ల సాంకేతిక, పరిశోధన రంగంలో మంచి పరిణామాలు సంభవిస్తాయన్నారు. పరిశ్రమలలో పరిశోధన సహకారానికి వేదికలుగా నిలుస్తాయన్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి ఉపయోగపడుతుందన్నారు. ఎం.బి.బి.ఎస్‌లో క్లాసు రూమ్ పాఠాలు చాలా వరకు రెండో సంవత్సరంతోనే పూర్తవుతాయని, ఇలాంటి ఒరవడినే అనుసరిస్తూ ఇంజినీరింగ్ కాలేజీల్లో రీసెర్చ్ పార్కులు ఏర్పాటు చేయాలన్నారు. వీటివల్ల విద్యా దశకు, ఉద్యోగ దశకు మధ్య అంతరాలు తగ్గుతాయన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు స్వయం ఉపాధి మార్గంలో ప్రవేశించడానికి కావలసిన శిక్షణ దొరుకుతుందన్నారు.

రేపు సంగీత విభావరి

దాబాగార్డెన్స్: గీత్ సంగీత్ సినీ సంగీత సాంస్కృతిక సంస్థ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 4న శశివదనే.. శశివదనే శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం 5.30 గంటల నుంచి దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న ఈ కార్య క్రమం పోస్టర్‌ను సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు ఆయన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు.సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ గాయకుడు, మాజీ డిప్యూటీ పోలీస్ కమిషనర్ మహ్మద్ ఖాన్ మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. న్యాయవాది ఎస్ఎస్ఎన్ రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా 108 సేవలు



వాహనాలను తనిఖీ చేస్తున్న 108 స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మురుగన్

మహారాణిపేట: 108 వాహన సేవల్ని మరింత మెరుగు పరిచేందుకు వీలుగా ప్రభుత్వానికి నివేదిస్తామని ఆ విభాగం స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మురుగన్‌బృందం హామీ ఇచ్చింది. గురువారం విశాఖలోని పలు ప్రాంతాల్లోని 108 వాహనాల పని తీరుపై ఆకస్మిక తనిఖీలు జరిపారు. ప్రభుత్వం తరఫున నగరానికి విచ్చేసిన మురుగన్‌బృందం స్టేట్ నోడల్ అధికారి హోదాలో పలు కీలక అంశాలపై చర్చించింది. క్షతగాత్రుల్ని ఆదుకునేందుకు అహర్నిశలు ప్రయత్నిస్తామని, సేవలు మరింత మెరుగ్గా ఉంటాయని స్పష్టం చేసింది. విశాఖ జిల్లా 108 విభాగం మేనేజర్ వీవీ త్రినాథరావు, సిటీ 108 విభాగం కో ఆర్డినేటర్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వంతోనే ప్రగతి సాధ్యం



ప్రసంగిస్తున్న రవికుమార్

ఏయూక్యాంపస్: ప్రశ్నించే తత్వం కలిగి ఉంటేనే ప్రగతి సాధ్యపడుతుందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్, కస్టమ్స్ అండ్ నార్కోటిక్ ట్రైనింగ్ సెంటర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఇ.రవి కుమార్ అన్నారు. ప్రశ్నించడం ప్రతీ వ్యక్తి అలవాటు చేసుకోవాలన్నారు. బీచ్‌రోడ్డులోని నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన అంతర్‌జిల్లా యువ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కడప జిల్లాకు చెందిన 27 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ క్రిటికల్ థింకింగ్, క్రియేటివిటీ, కమ్యూనికేషన్, సమన్వయం ఎంతో అవసరమన్నారు. ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యపడుతుందన్నారు. నెహ్రూ యువ కేంద్రం డైరెక్టర్ గొర్లి మహేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పలు సమ్మేళనాలను నిర్వహిస్తున్నామని, యువతకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. తూనికలు, కొలతలు శాఖ ఉప నియంత్రణ అధికారి థామస్ రవికుమార్ తన ప్రసంగంలో వివిధ శాస్త్రవేత్తలు సాధించిన విజయాలను ప్రస్తావించారు.

సంస్కృతీ సంప్రదాయాలు తెలుసుకోవాలి

మిసెస్ ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రి నాయుడు మాట్లాడుతూ ప్రతి ప్రాంతం ఒక్కొక్క సంస్కృతీ సంప్రదాయాలు కలిగి ఉంటుందని, వాటిని తెలుసుకోవడం ఎంతో అవసరమని అన్నారు. సెయింట్ జోసెఫ్ ఉమెన్స్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కె.మాణిక్య కుమారి, ఎస్ యూజే జర్నలిజం స్కూల్ వైస్ చైర్మన్ ఎన్.నాగేశ్వర రావు, సమాచార హక్కు చట్టం అమలు కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకట రమణ ప్రసంగించారు. కార్యక్రమంలో ఎ.రాంప్రసాద్, పృథ్వీ ప్రసన్న, జేమ్స్ జ్ఞానదీప్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా బీచ్ రోడ్డు



బీచ్‌రోడ్డు నిర్మానుష్యంగా మారింది. గురువారం సాయంత్రం నావికాదళ విన్యాసాల నేపథ్యంలో బీచ్‌రోడ్డులో పోలీసులు పలు ఆంక్షలు విధించారు. దీనితో మధ్యాహ్నం సుమారు 3గంటల సమయం నుంచి వాహనాలను పూర్తిగా నిషేధించారు. జిల్లా పరిషత్ జంక్షన్, పందిమెట్ట జంక్షన్, ఆల్ ఇండియా రేడియో, పార్క్ హోటల్ జంక్షన్ తదితర మార్గాల నుంచి బీచ్‌రోడ్డులోకి వాహనాలను పూర్తిగా నిలిపివేశారు. అదే విధంగా వైఎంసీఏ, విక్టరీ ఎట్ సీ, యోగా విలేజ్, పోలీస్ మెస్ తదితర ప్రాంతాల నుంచి సైతం వాహనాలు ప్రవేశించకుండా బారికేడ్లతో మూసివేశారు.



నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే బీచ్ రోడ్డు ప్రశాంతంగా మారిపోయింది. నేవీ డేకి ప్రజలు కాలినడకనే వచ్చారు. తమ వాహనాలను నిర్దేశిత ప్రాంతాలలో పార్కింగ్ చేసి నడుచుకుంటూ విన్యాసాలను వీక్షించారు.

–ఏయూక్యాంపస్

పోలీస్ బెటాలియన్‌లో వార్షిక క్రీడా పోటీలు

పీఎం పాలెం: బక్కన్నపాలెం సమీపంలోని ఏపీఎస్‌పీ పోలీస్ బెటాలియన్‌లో వార్షిక క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి నిత్యం వ్యాయామంతో పాటు ప్రవేశం ఉన్న క్రీడల్లో ప్రాక్టీస్ చేయడం అవసరమని పేర్కొన్నారు. క్రీడలలో రాణిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి కీర్తి లభించడంతో పాటూ డిపార్ట్‌మెంట్‌లోనూ మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. గురువారం జరిగిన రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్ తదితర పోటీలలో విజయం సాధించిన వారికి మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి.సత్యం, వి.నారాయణరావు, యూనిట్ డాక్టర్లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.